అడుగడుగునా గోతులే..

- గోతులమయంగా రహదారి
- వాహన చోదకుల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు





హండ్రెడ్ ఫీట్ రోడ్డు నుంచి ఎస్‌వీ జనరల్ మార్కెట్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి

రాజమహేంద్రవరం రూరల్: ఆ రోడ్డులో అడుగడుగునా గోతులే దర్శనమిస్తున్నాయి. పగలు కాస్త చూసుకుని కష్టపడి వెళ్లినా, రాత్రి సమయంలో వాహన చోదకులు నరకయాతన పడుతున్నారు. రోడ్డు వేయడానికి సాంకేతిక సమస్యలున్నప్పటికీ కనీసం గోతులు పూడ్చించే చర్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు చేపట్టకపోవడంతో వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి వేంకటేశ్వర(ఎస్‌వీ) జనరల్ మార్కెట్‌కు ప్రతి రోజూ వేలమంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇందులో కొందరు హండ్రెడ్ ఫీట్ రోడ్డు నుంచి ఎస్‌వీ జనరల్ మార్కెట్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే నిత్యావసర వస్తువులను దిగుమతి చేసేందుకు లారీలు సైతం మార్కెట్‌కు వస్తుంటాయి.

వర్షాలతో అధ్వానం

ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు అడుగడుగునా గోతులమయంగా మారింది. రాత్రి సమయంలో ఈ గోతుల్లో పడి పలువురు వాహన చోదకులు గాయాలపాలవుతున్నారు. ప్రస్తుతం రోడ్డు వేయాలంటే కొందరు భూ యజమానులకు టీడీఆర్ బాండ్లను ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. అదే రోడ్డు నిర్మాణానికి అడ్డంకిగా మారింది. అయితే కనీసం గోతులను పూడ్చించే పనులను సైతం ప్రజాప్రతినిధులు, అధికారులు చేపట్టడం లేదు.



గొయ్యిలో సరిచేయకుండా వదిలేసిన మట్టి

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



హండ్రెడ్ ఫీట్ రోడ్డు నుంచి ఎస్‌వీ జనరల్ మార్కెట్ వరకు రహదారి గోతులమయంగా మారింది. దీనివల్ల వ్యాపారులు, వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో మూడెకరాలకు భూ యజమానులకు టీడీఆర్ బాండ్లను ప్రభుత్వం ఇచ్చి, సాంకేతిక సమస్యను తొలగించి రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ఈ రోడ్డులో గోతులనైనా పూడ్చించాలి.

– మద్దాల రవి, జనరల్ సెక్రటరీ, ఎస్‌వీ జనరల్ మార్కెట్ కమిటీ

రూ.4 వేల కోట్ల ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

సీటీఆర్ఐ: ఎస్సీ, ఎస్టీ భూ నిర్వాసితులకు రూ.4 వేల కోట్ల ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రముఖ ప్రజా ఉద్యమకారుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది బొజ్జా తారకం వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆదివాసీ మహాసభ, దళిత బహుజన వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా సమావేశం నిర్వహించాయి. ముందుగా బొజ్జా తారకం చిత్రపటానికి సూర్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా గృహ నిర్మాణాలకు భూసేకరణ చేసిన కలెక్టర్లపై కేసులు నమోదు చేయాలన్నారు. జీలుగుమిల్లి పరిధిలో నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. 1994లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తహసీల్దార్లకు బదులుగా రెవెన్యూ డివిజనల్ అధికారులు మాత్రమే కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. పోలవరం నిర్వాసితులలో 60 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీలు ఉన్నందున, వీరి సౌకర్యార్థం పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం తరలించాలన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రాజమహేంద్రవరంలో కోర్టు నెలకొల్పాలన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలలో అక్టోబర్ 3న గ్రామసభలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ మహాసభ అధ్యక్షుడు మిడియం వెంకటస్వామి, పూనెం విష్ణు, మిడియం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగుల సంక్షేమానికి ఉద్యోగ సంఘాలు కృషి చేయాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏపీఎన్జీజీవో సంఘ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు అన్నారు. నూతన జిల్లా అడహక్ కమిటీ ఏర్పాటు భవిష్యత్తు కార్యాచరణపై మంగళవారం స్థానిక ఎన్జీజీవో హోమ్‌లో వివిధ విభాగాల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యలపై ఎన్జీజీవో సంఘం నిరంతరం పనిచేస్తుందన్నారు. పెండింగ్‌లోని కరువుభత్యం వెంటనే ప్రకటించాలని, వేతన సవరణ సంఘం నియమించాలని, ఈ లోపు మధ్యంతర భృతి చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలో తూర్పు గోదావరి జిల్లా అడహక్ కమిటీని ఏర్పాటు చేస్తామని, ఆ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల పర్యటనను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ కోరారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి డీవీ వేణు మాధవరావు, జిల్లా ఉపాధ్యక్షులు సరెళ్ల చంద్రరావు పాలపర్తి మూర్తిబాబు, ప్రసాద్, కమల, నగర సంఘ ఇన్‌చార్జి అధ్యక్షుడు పి.అనిల్ కుమార్, కార్యదర్శి సేవా ప్రవీణ్ కుమార్, మహిళా విభాగం చైర్ పర్సన్ సత్యవతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

కంబాలచెరువు: ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. అకాడమియా, ఫార్మా సమన్వయం, సుస్థిర భవిష్యత్తుకు సేంద్రియ సంశ్లేషణ, ఔషధ ఆవిష్కరణలను అభివృద్ధి చేయటం అనే అంశంపై ఈ కార్యక్రమం జరిగింది. హైదరాబాద్‌లోని కన్సల్టెంట్ టు ఎవరెస్ట్ ఆర్గానిక్స్ లిమిటెడ్‌కు చెందిన వీరారెడ్డి, ఐఐసీటీ చీఫ్ శాస్త్రవేత్త డాక్టర్ పి.మంగళ గౌరీ, మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ బీరయ్య బైరే, నాట్కో ఫార్మా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.శ్రీనివాస్, అక్కు ప్రొఫెసర్ జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలు, పరిశోధనలు, ఫార్మాలో ఉద్యోగ అవకాశాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు పరిశోధకులలో, విద్యార్థులలో పరిశోధనపై ఆసక్తిని పెంచుతాయన్నారు. పరిశోధకులు సమర్పించిన వివిధ పరిశోధన పత్రాలతో కూడిన సదస్సు సావనీర్‌ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్, రసాయనశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాస్‌రావు, ఆర్గనైజషన్ సెక్రటరీ డాక్టర్ మల్లికార్జున , రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్పీలే మెప్మా పథకాలకు రథసారథులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ కనకరాజు

రాజమహేంద్రవరం సిటీ: మెప్మా పథకాలకు రథసారథులు రిసోర్స్ పర్సన్లని (ఆర్పీలు) జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కనకరాజు అన్నారు. మెప్మా పథకాలు అమలు జరుగుతున్న తీరుపై ఆర్పీలతో మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆయన సమీక్షించారు. స్వయం సహాయక సంఘాలకు ఏఏ రుణాలు, బ్యాంకు లింకేజీ రుణాలు, సూర్యఘర్, పీఎం స్వానిధి తదితర పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి సంఘ సభ్యురాలి డేటాను ఆన్‌లైన్‌లో సక్రమంగా పొందుపరచాలని, సంఘాల సమావేశాలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. పొదుపు సంఘాలలో కొత్తగా సభ్యత్వం తీసుకుంటున్న మహిళలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఓ వ్యాపారవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో మెప్మా అడుగులు ముందుకు వేస్తోందన్నారు. మొబైల్ మార్టులు, ర్యాపిడో వెహికల్స్, తృప్తి క్యాంటీన్, టూరిజం సర్వీసెస్, అమృతమిత్ర వంటి స్పెషల్ ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా ఎక్కువ మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఎంఎం వి.రామలక్ష్మి, టెక్నికల్ ఎక్స్ పర్ట్స్ ఎం.ఫణికుమార్, పి.శ్రీదేవి, టీఎంసీ సాయికుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న విశ్రాంత డీఎస్పీ రాజగోపాల్

రాజమహేంద్రవరం సిటీ: ఆర్థిక క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని విశ్రాంతి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వాసంశెట్టి రాజగోపాల్ అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర నైపుణ్య శిక్షణ కేంద్రం హాలులో మంగళవారం జరిగిన 79వ బ్యాచ్ కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు చేస్తున్న నిస్వార్థ సేవలకు అందరూ తోచిన రీతిలో ప్రోత్సాహం అందించి సహకరించాలన్నారు. గుబ్బల రాంబాబు మాట్లాడుతూ శిక్షణానంతరం ఒంటరి మహిళలకు, ఆర్థికంగా బలహీనంగా ఉన్నవారికి ఇప్పటి వరకు సుమారు 520 కుట్టుమెషీన్లు అందజేశామన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఎండీ మస్తాన్, పప్పు వీరభద్రరావు, చంద్రశేఖర్, శిక్షణ టీచర్ దివ్య సింధు తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘నన్నయ’లో డాక్టర్ రెడ్డీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్



బ్రోచర్‌ని విడుదల చేస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో బుధవారం డాక్టర్ రెడ్డీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ జరగనుందని వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మంగళవారం తెలిపారు. 2024–25లో బీఎస్సీ, ఎంఎస్సీలో కెమిస్ట్రీ లేదా బయోటెక్నాలజీ పూర్తి చేసి, 10వ తరగతి నుంచి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. ఎంపికైతే బీఎస్సీ వారికి రూ.2.10 లక్షలు, ఎంఎస్సీ వారికి రూ.2.60 లక్షలు వార్షిక వేతనంగా ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈసీఈ విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్

యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎస్‌డీవీవీఎల్ సంస్థ ఆధ్వర్యంలో ఈసీఈ ఫైనలియర్ విద్యార్థులకు బుధవారం నుంచి మూడు రోజులపాటు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ జరగనుందని వీసీ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ని మంగళవారం విడుదల చేశారు.

రక్షణ కవచంగా ఓజోన్ పొర



ఓజోన్ పొర గురించి వివరిస్తున్న ప్రొఫెసర్ గోపి



రఘుదేవపురంలో ఓజోన్ పొర ఆవశ్యకతపై డ్రాయింగ్ వేసిన విద్యార్థులు

రాజానగరం: భూమిని ప్రమాదకరమైన కిరణాల నుంచి కాపాడే గొడుగు ఓజోన్ పొర అని, దానిని భావితరాలకు సంరక్షించాలని ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ గోపి అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఓజోన్‌ని దెబ్బతీస్తున్న అంశాలు, పరిరక్షణ కోసం చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు కలిసి ఓజోన్ పరిమిత భూమి, పరిమిత చలన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనరాజ్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఓజోన్ పొరపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం బొబ్బిల్లంక హైస్కూల్లో ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఓజోన్ పొర ఆవశ్యకతపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల గ్రీన్ కోర్ టీచర్ జనపరెడ్డి మోహనరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే రఘుదేవపురం పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్లకార్డులతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

బిక్కవోలు: పందలపాకలోని శ్రీ పడాల పెద్దపులారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత విద్యార్థులు ఓజోన్ అక్షర ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు.మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఓజోన్ పొర ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. చిత్ర లేఖన ఉపాధ్యాయులు మూర్తి ఆధ్వర్యంలో ఓజోన్ పరిరక్షణ మన అందరి బాధ్యత అనే అంశంపై చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు లయన్స్ క్లబ్ గొల్లల మామిడాడ శ్రీసూర్య సౌజన్యంతో విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలోని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొనాల సత్తిరాజు పాల్గొన్నారు.

అర్హులకు అందని సంక్షేమ పథకాలు



మండల పరిషత్ సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతి నిధులు

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశం వాడీ వేడిగా జరిగింది. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకష్ణారెడ్డి హాజరయ్యారు. ముందుగా మండలస్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అర్హులకు సంక్షేమ పథకాలు అందడంలేదని అధికారులు సహకరించాలని కోరారు. తాగునీరు అందించాలని, బోర్లు వేసుకున్న రైతులకు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. రోడ్ల అభివృద్ధి విషయంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైస్ ఎంపీపీలు రాయుడు రాంబాబు, మట్టా శ్రీను, తహసీల్దార్ కోసు అనసూయ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు ‘యాత్ర సేవా దివస్’

కోరుకొండ: రాజమండ్రి విమానాశ్రయంలో బుధవారం ‘యాత్ర సేవా దివస్–2025’ ఘనంగా నిర్వహిస్తామని విమానాశ్రయ డైరెక్టర్ శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. దేశవ్యాప్తంగా ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో అన్ని విమానాశ్రయాలు ఈ దినోత్సవాన్ని ఒకేసారి నిర్వహించనున్నాయి. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విమానయానం చేసే ప్రయాణికులకు ప్రపంచ స్థాయి అనుభవాన్ని అందించేందుకు ఏఏఐ తీసుకున్న చర్యలను ప్రతిబింబించేలా ఈ దినోత్సవం జరుపుతున్నట్లు తెలిపారు. రాజమండ్రి విమానాశ్రయంలో జరిగే ప్రధాన కార్యక్రమాలు సాంస్కృతిక ప్రదర్శనలు, క్విజ్, పెయింటింగ్ పోటీలు, విమానాశ్రయ భవనాల అలంకరణలు, ప్రయాణికులకు ఉచిత వైద్య పరీక్షలు ఆతిథ్య సత్కారం కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అమ్మ పేరుతో ఒక మొక్క నినాదంతో చెట్లు నాటడం, సీనియర్ సిటిజన్లు సత్కారం, విద్యార్థులు, విమానాశ్రయ సిబ్బందితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలు విమానాశ్రయాలు, ప్రయాణికులకు మధ్య మరింత సాన్నిహిత్యాన్ని పెంపొందించడంలో ఏఏఐ దార్శనికతను ప్రతిబింబిస్తాయని వివరించారు.

క్లుప్తంగా

ఎంఈవోల బదిలీలు చేపట్టాలి

కంబాలచెరువు: గత ఎనిమిదిన్నరేళ్లుగా మండల విద్యాశాఖాధికారుల బదిలీలు లేకపోవడంతో విద్యాశాఖలో తీవ్ర వైరాస్యం నెలకొందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి వీవీ శాస్త్రి అన్నారు. నగరంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో ఆపస్ సభ్యత్వ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాల్లో పని చేస్తున్న ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు 22 ఏళ్లుగా ఒకే ప్రాంతంలో ఉండిపోయారన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ల పరిస్థితి కూడా ఇదేనన్నారు. వీరందరికి మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్)య మంజూరు చేసి బదిలీలు చేబట్టాలన్నారు.

లారీ బోల్తా



బోల్తా పడిన చేపల మేత లోడు లారీ

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారిపై బొమ్మూరు రాఘవేంద్రనగర్ కాలనీ సమీపంలో సోమవారం అర్ధరాత్రి చేపల మేత లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది, బొమ్మూరు పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా లారీని క్రేన్ సాయంతో పక్కకు తొలగించారు. ఆ లారీ విజయవాడ నుంచి ఒడిశాకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

బొజ్జా తారకం ఆశయ సాధనకు కృషి



బొజ్జా తారకం చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న బీఎస్పీ నాయకులు

సీటీఆర్ఐ: ఉద్యమ నేత బొజ్జా తారకం ఆశయ సాధన కోసం కృషి చేద్దామని బీఎస్పీ అర్బన్ ఇన్‌చార్జి ఇసుకపట్ల రాంబాబు అన్నారు. కోర్లంపేటలోని బీఎస్పీ అర్బన్ కార్యాలయంలో మంగళవారం బీఎస్పీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బొజ్జా తారకం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం రాజు, అర్బన్ కార్యదర్శి కొంకి రమేష్, రాజ్యాంగ పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పులగుర్త గ్రామ శాఖ అధ్యక్షుడిగా గోపాలకృష్ణ

అనపర్తి: పులగుర్త గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు అనపర్తి గోపాలకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాకరపర్తి వేణు, మాజీ సర్పంచ్ వేమగిరి రాజు, ఎంపీటీసీ గుత్తుల మహాలక్ష్మి, విజయ్, మాజీ చైర్మన్ మల్లిడి వెంకటరెడ్డి, వార్డు సభ్యులు గుత్తుల ఏడుకొండలు, దెంగేటి సత్తిబాబు, బొప్పన చిన్న, పల్లెటి రాయుడు తదితర వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

బిక్కవోలు: రైతులు పాడి పశువులకు తప్పనిసరిగి గాలికుంటు టీకాలు వేయించాలని పందలపాక పశువైద్యుడు ప్రణీత్ అన్నారు. మంగళవారం ఆయన గాలికుంటు నివారణ టీకాలు పశువులకు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, సమతుల పోషకాహారాన్ని అందించడం, సమీకృత దాణాను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలోని రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



బాలతేజ (ఫైల్)

రంగంపేట: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పాత వీరంపాలెం గ్రామానికి చెందిన నల్లమోలు బాల తేజ (22) ఈనెల 15న సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో తన మోటార్ సైకిల్‌పై బయటకి వెళ్లాడు. చీకటిపడినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడి చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా ప్రయోజనం లేకపోయింది. మంగళవారం బాలతేజ తండ్రి నల్లమోలు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. బాలతేజ అచూకీ తెలిసిన వారు రంగంపేట ఎస్సై శివప్రసాద్ 9440904854, అనపర్తి సీఐ సుమంత్ 9440796538 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

సుప్రీం ఆదేశాలు కూటమికి చెంపపెట్టు

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ ఆరీఫ్



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వివాదాస్పద వక్ఫ్ చట్టంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తాత్కాలిక ఆదేశాలు రాష్ట్రంలోని కూటమి పాలకుల ముస్లిం వ్యతిరేక విధానాలకు చెంపపెట్టు వంటిదని వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ ఆరీఫ్ అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ చట్టం సవరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తాత్కాలిక ఆదేశాలు ముస్లిం సమాజానికి ఊరట కలిగించాయన్నారు. తుది తీర్పులో ముస్లింలకు శాశ్వత న్యాయం జరుగుతుందని ఆకాంక్షించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తెచ్చిన ఈ వివాదాస్పద వక్ఫ్ చట్టానికి అనుకూలంగా పార్లమెంటులో తన ఎంపీలతో చంద్రబాబు ఓటు వేయించారన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ముస్లిం ప్రయోజనాల విషయంలో రాజీపడేది లేదని మరోసారి నిరూపిస్తూ సుప్రీంకోర్టులో కేసు ఫైల్ చేయడానికి ఆదేశాలు ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ముస్లిం సమాజం రుణపడి ఉంటుందన్నారు. టీడీపీ మద్దతుతో ఈ బిల్లు ఆమోదం పొందిందని, చంద్రబాబు నిర్ణయం వల్లే ముస్లిమేతరులు వక్ఫ్‌బోర్డులో సభ్యులుగా వచ్చారన్నారు.

బుర్రకథ కళాకారుడు వీర్నాల కృష్ణకు అవార్డులు



ఎన్‌టీఆర్ జాతీయ రత్న అవార్డు అందుకుంటున్న వీర్నాల కృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ గ్రామానికి చెందిన బుర్రకథ కళాకారుడు వీర్నాల కృష్ణకు డాక్టర్ నందమూరి తారక రామారావు జాతీయరత్న అవార్డు, సేవారత్న అవార్డులు లభించాయి. ఈ విషయాన్ని ఆయన మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల14, 15 తేదీల్లో విశాఖపట్నంలో దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ కళారంగంలో నందమూరి తారక రామారావు జాతీయరత్న అవార్డు, విశాఖ రత్న కల్చరల్ అసోసియేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా సేవా రత్న అవార్డు అందజేశాయన్నారు. కాగా.. వీర్నాల కృష్ణ బుర్రకథలు, జానపద గేయాలు, వీధి నాటకాలు, మ్యాజిక్ షో చేస్తూ పది మందికి అవకాశాలు కల్పిస్తున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కల్చరల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ప్రభుత్వ సంస్థలలో అనేక ప్రదర్శనలు ఇస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

రంగంపేట: విద్యార్థులు మొక్కల పెంపకాన్ని బాధ్యతగా చేపట్టి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు ఎన్‌జేకే శుభాకర రెడ్డి సూచించారు. మండల పరిధిలోని సింగంపల్లి హైస్కూల్లో గ్రాసిమ్ ఇండస్ట్రీ సమకూర్చిన 200 మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పచ్చదనం పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రాసిమ్ ఇండస్ట్రీ ఉద్యోగులు పాల్గొన్నారు.

19లోపు వాహన మిత్రకు దరఖాస్తు చేసుకోండి

రాజానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు ఆర్థిక సాయం కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఈనెల 19లోగా తమ దరఖాస్తులను సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో అందజేయాలని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ మంగళవారం తెలిపారు. ఈ దరఖాస్తుతోపాటు ఆధార్, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం సీ బుక్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్‌లను కూడా జత చేయాలన్నారు. అలాగే దరఖాస్తు చేసే సమయంలో ఆధార్ కార్డు లింకై ఉన్న మొబైల్‌కి ఓటీపీ వస్తుందని, లేకుంటే బయోమెట్రిక్ చేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుదారునికి తప్పనిసరిగా ఎన్‌పీసీఐ లింక్ ఉండాలన్నారు.

నవలా సామ్రాట్ శరత్ చంద్రకు ఘన నివాళి

రంగంపేట: మండల పరిధిలోని దొడ్డిగుంట గ్రామంలో స్థానిక బాల గణపతి ఆలయం వద్ద నవలా సామ్రాట్ శరత్ చంద్ర చటోపాధ్యాయ 150వ జయంతిని రాజకీయ, సినీ విశ్లేషకుడు అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా చరత్ చంద్ర చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మరిడయ్య మాట్లాడుతూ శరత్ చంద్ర బెంగాలీలో అనేక నవలలు, కథలు, నాటికలు, వ్యాసాలు రచించారని అన్నారు. శరత్ చంద్ర రచించిన నవలల ఆధారంగానే దేశంలో, పొరుగు దేశాల్లో సుమారు 90 సినిమాలు రూపొందించారని తెలిపారు. ఆయన రచించిన నవల ఆధారంగానే దేశంలో 14 భాషల్లో దేవదాసు సినిమా వచ్చిందన్నారు.